రైతు కష్టం వర్షార్పణం

నర్సాపూర్ మార్కెట్ యార్డులో వాన నీటికి కొట్టుకుపోతున్న ధాన్యం

చిలిపిచెడ్ మండలం అజ్జమర్రి గ్రామంలో వర్షానికి తడుస్తున్న ధాన్యం కుప్పలు

నర్సాపూర్, మే 19: కష్టపడి పండించిన ధాన్యం నీటిపాలై రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి నర్సాపూర్ మార్కెట్ యార్డులో రైతన్నలు ఆరబోసిన వడ్లు వాన నీటికి తడిపోయాయి. కొందరి ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. సకాలంలో తూకం వేయకనే అకాల వర్షాలు పడి ధాన్యం తడిసి, మొలకలెత్తుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డుకు ధాన్యాన్ని తీసుకొచ్చి నెల రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

రోజంతా పడిగాపులు

నర్సాపూర్ మార్కెట్ యార్డుకు ధాన్యాన్ని తీసుకొచ్చి పడిగాపులు కాయాల్సి వస్తున్నదని రైతులు వాపోయారు. చిలిపిచెడ్ మండలం అజ్జమర్రి కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని తూకం వేసి బ్రాహ్మణపల్లి లోని రైస్‌మిల్‌కు తరలించగా అక్కడ స్థలం లేకపోవడంతో రైస్‌మిల్లర్ ఆదేశాల మేరకు మార్కెట్ యార్డులోని గోదాంకు తరలించడం జరిగింది. మార్కెట్ యార్డుకు ధాన్యాన్ని తరలించగా అన్‌లోడ్ చేయడంలో, రైస్ మిల్లర్ గోదాం తాళాలు తీయకపోవడంతో జాప్యం జరుగుతున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, రైస్ మిల్లర్లకు సఖ్యత లేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని రైతులు వాపోయారు.

వడ్లను వెంటనే కొనాలి

మనోహరాబాద్, మే 19: ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనాలని, ఆ ధాన్యాన్ని లారీల్లో తరలించాలని రైతు సంరక్షణ సమితి స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు మైసయ్య అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

నెల రోజులైనా కాంటా పెట్టలేదు

మార్కెట్ యార్డుకు వడ్లు తీసుకొచ్చి నెల రోజులవుతున్నా ఇప్పటికీ అధికారులు కాంటా పెట్టలేదు. ఈ రోజు పెడతాం, రేపు పెడతామని దాటవేస్తున్నారు. ఆదివారం వర్షం పడడంతో నీటికి వడ్లు కొట్టుకుపోయాయి. తడిసినప్పుడల్లా తేమ పేరుతో కాంటా పెట్టడంలేదు. ఇప్పటికి మూడుసార్లు వడ్లను ఎండబోశా.

– నరసింహరెడ్డి, హన్మంతాపూర్, నర్సాపూర్

నర్సాపూర్ మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం

చిలిపిచెడ్ మండలంలో.. నర్సాపూర్‌లో ధాన్యాన్ని చూస్తున్న రైతు

శివ్వంపేటలో ధాన్యం తడుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న రైతు

ఘనంగా పోచమ్మ తల్లి ఉత్సవాలు

- పూజలకు హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న గిరిజనులు

శివ్వంపేట, మే 19: మండలంలోని బిక్యతండాలో నల్ల పోచమ్మ తల్లి జాతర ముగిసింది. రెండు రోజులుగా బిక్యతండా, నానుతండా, సీత్యతండాలు కలసి ఒకే దగ్గర ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, పలువురు హాజరై, గిరిజనులతో కలసి పూజలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, నాయకులు సూరారం నర్సింలు, యాదాగౌడ్, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, నవీన్‌గుప్తా, శ్రీనివాస్ గౌడ్, రాంచందర్, భీమ, గన్య, మోతిసింగ్, దారు, బుచ్య, రమేశ్, రామ్లు, పూల్‌సింగ్, హరిసింగ్, రవికుమార్ రాథోడ్ ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి: ఎంపీపీ

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట, మే 19: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి సూచించారు. ఆదివారం మండలంలోని గవ్వలపల్లిలో నర్సరీని ఆమె సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట సింగిల్ విండో మాజీ చైర్మన్ ఆవుల గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి శేఖర్ ఉన్నారు.

ఘనంగా గట్టు మైసమ్మ బోనాలు

గట్టు మైసమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మెదక్‌రూరల్, మే 19: మండలంలోని మక్తాభూపతిపూర్‌లో గట్టు మైసమ్మ అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభమైంది. మొదటి రోజు ప్రత్యేక అలంకరణ చేసి వేకువజాము నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాలు, బండ్లను ఆంగరంగ వైభవంగా ఊరేగించారు. సోమవారం నల్ల పోచమ్మకు, మంగళవారం మత్తడి పోచమ్మకు బండ్లు, బోనాలు, బుధవారం రథం ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు, కమిటీ సభ్యులు సిద్దిరాంగౌడ్, మురళి, పోచయ్య, ఆకుల శ్రీనివాస్, రాములు, నర్సింలు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తూప్రాన్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నర్సింలు

తూప్రాన్, మే 19: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై శివానందం కథనం ప్రకారం.. వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన నర్సింలు, పోచయ్య, ఒక వాహనంపై, తమిళనాడుకు చెందిన మోహన్, సతీశ్ మరో వాహనంపై తూప్రాన్ వైపు బయలుదేరారు. గజ్వేల్ వైపు వెళ్తున్న ఆటో ఈ బైక్‌లను ఢీ కొట్టింది. కర్రె నర్సింలు (44), పోచయ్య, మోహన్, సతీశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సింలు (44) మృతి చెందాడు. పోచయ్య, మోహన్, సతీశ్‌కు గాంధీ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సోమవారం నర్సింలు సోదరుడి ఇంట్లో వివాహం ఉంది.

రూ.లక్షా 45వేల ఎల్‌వోసీ అందజేత

ఎల్‌వోసీని అందజేస్తున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి

చిలిపిచెడ్, మే 19: మండలంలోని గన్యతండాకు చెందిన రాట్ల శిరీష అనారోగ్యంతో ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ప్రభుత్వం నుంచి మంజూరై రూ. లక్షా 45వేల ఎల్‌వోసీని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి ఆదివారం అందజేశారు. ఉపాధ్యక్షుడు పండరి, మాజీ సర్పంచ్ ఆంధ్రయ్య, దేవిచంద్ ఉన్నారు.

తండ్రికి కర్మకాండ చేసిన కూతురు



కన్నతండ్రికి కర్మకాండ చేస్తున్న కూతురు

చిన్నశంకరంపేట, మే 19: తండ్రికి ఓ కూతురు కర్మకాండ చేసిన ఘటన మండలంలోని గజగట్లపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకల రవీందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి మగ సంతానం లేదు. దీంతో కర్మకాండను కూతురు కావేరి నిర్వహించింది. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సౌజన్యంతో స్థానిక నాయకులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

అమ్మవారికి బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట, మే 19: ఆధ్యాత్మికతతోనే మానసిన ప్రశాంతత లభిస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తెలిపారు. ఆదివారం మండలంలోని మిర్జాపల్లిలో పోచమ్మ తల్లికి బోనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి బోనాన్ని ఎత్తుకున్నారు. ఎమ్మెల్యేతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ అరుణ, మాజీ సర్పంచ్ జనార్దన్, మాజీ ఉప సర్పంచ్ మనోజ్‌కుమార్, నాయకులు ప్రభాకర్, సంజీవులు, కృష్ణగౌడ్ ఉన్నారు.

ధాన్యం వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలి

ట్యాబ్‌లో వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

మెదక్‌రూరల్, మే 19: ధాన్యం కొన్న వివరాలను ట్యాబ్‌లో వెంటనే ఎంట్రీ చేయాలని కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశించారు. ఆదివారం మండలంలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో ధ్యానం కొనుగోళ్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందు లు తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ ను నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, మే 19: నర్సాపూర్ మున్సిపాలిటీలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మున్సిపాలిటీలోని గాంధీ విగ్రహం వద్ద పాత డ్రైనేజీ ఓపెన్ వాల్స్‌తో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ సమస్యను మున్సిపల్ చైర్మన్ పారిశుధ్య కార్మికులతో పరిష్కరించారు. ఒకటో వార్డులో టాయిలెట్స్, వాటర్ ట్యాంక్, స్కూల్ మరమ్మతులను పర్యవేక్షించారు. ఆయనతో బీఆర్ఎస్ నాయకులు నాగభూషణం, ఫైజాన్, అర్బాస్ ఉన్నారు.

చోరీ నింద పెట్టాడని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చేగుంట, మే 19: తనపై చోరీ నింద పెట్టాడని ఆత్మహత్యాయత్నానికి శ్రీకాంత్ పాల్పడిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన కిచ్చిగారి సూర్యకళ కుమారుడు శ్రీకాంత్ తన టీవీఎస్‌పై ఆదివారం వెళ్తుండగా స్థానిక గాంధీ చౌస్తా వద్ద మంద ప్రవీణ్ వాహనాన్ని ఆపి తమ ఇంట్లోంచి గ్యాస్ సిలిండర్, నగదు ఎత్తుకెళ్లావని శ్రీకాంత్‌పై దాడి చేశాడు. అవమానం భరించలేక శ్రీకాంత్ తన అంగికి మంట అంటించుకున్నాడు. దీంతో ఒంటికి మంటలు అంటుకోగా, చెట్ల కొమ్మల తో మంటలార్పారు. మంటలతో గాయాల య్యాయి. స్థానిక కేజీఎస్ దవాఖానకు, అక్క డ నుంచి నార్సింగిలోని ఓ ప్రైవేటు దవానాకు తరలించారు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుపాయల్లో భక్తుల సందడి

పూజలందుకుంటున్న వనదుర్గా భవానీ మాత, క్యూలైన్లో భక్తుల సందడి

పాపన్నపేట, మే 19: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత ఆలయంలో ఆదివారం పెద్దఎత్తున భక్తుల సందడి నెలకొన్నది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, దుర్గామాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి, సిబ్బంది రవివీర్ కుమార్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, బత్తిని రాజు, శ్రీకాంత్ ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ ప్రత్యేక పూజలు చేశారు. పాపన్నపేట ఎస్సై నరేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు నివాళి

నర్సాపూర్, మే 19: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా నర్సాపూర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ సుందరయ్య ప్రజా, వర్గ పోరాటాలు చేపట్టి పేదలకు అండగా నిలిచారన్నారు. పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రజా జీవితానికి అంకితం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, పోచయ్య పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు

పాపన్నపేట, మే 19: పాపన్నపేట ఉన్నత పాఠశాల ఎస్ఎస్‌సీ 2004-2005 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు. బ్యాచ్‌లో చనిపోయిన శ్రీకాంత్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం ఆకుల బాలయ్య, పూర్వ టీచర్లు రిటైర్డ్ ఎంఈవో మోహన్ రాజు, జ్ఞానోబా, మాధవరెడ్డి, పద్మశ్రీ, రాజశేఖర్, చంద్రహాస్, సురేందర్‌సింగ్, విక్రంరాజు, శ్రీరాందుర్గేశ్, వెంకట్, తులసి, సుప్రియ, శిల్ప పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

శివ్వంపేట, మే 19: శివ్వంపేటలోని ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటీవ్ సొసైటీలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిని లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల బస్తాకు రూ.1116 ఉంటుందని, కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్కు, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు తీసుకొచ్చి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

శివ్వంపేట, మే 19: మండలంలోని దొంతి గ్రామంలో వేణుగోపాలస్వామి గోశాలకు ఆదివారం రూ.20 వేలు విలువ చేసే పశుగ్రాసాన్ని తూప్రాన్‌కు చెందిన గంప సిద్దిరాములు దంపతులు అందజేసినట్లు నిర్వాహకుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్‌గుప్తా తెలిపారు.

మల్లన్న ఆలయంలో పూజలు

మెదక్‌రూరల్, మే 19: మంబోజిపల్లిలోని కొయ్యగుట్టపై కొలువుదీరిన మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం పూజారి మల్లన్న ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ఆలయ నిర్మాణ దాతకు సన్మానం

నర్సాపూర్, మే 19: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణ దాతకు హనుమాన్ స్వాములు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాత రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ గుడి పనులు సగం వరకు పూర్తి చేశామని, హనుమాన్ జయంతి అనంతరం రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్వాములు సుధీర్‌కుమార్ గౌడ్, అభినయ్‌గౌడ్, నవీన్, నరేశ్, శ్రీధర్, గంట రమేశ్, ఏసు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్సు

టేక్మాల్, మే 19: టేక్మాల్‌లోని హజ్రత్ సయ్యద్ బుర్హానుద్దీన్ ఔలియా రహ్మతుల్లాహి అలై దర్గా ఉర్సు నేటి నుంచి ప్రారంభమతుందని ఉమ్మడి మెదక్ జిల్లా మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఏ సలీం తెలిపారు. సాయంత్రం 7 గంటలకు జామే మసీద్ నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో సమర్పిస్తారన్నారు. రాత్రి జల్సే అజ్మాతే ఔలియా కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి హజ్రత్ సయ్యద్ షా అహ్మద్ నూరుల్లా హాసిని హుసేని ఖాద్రి, మౌలానా హమీద్ రహ్మాని విచ్చేసి సోఫి సిద్ధాంతాలు వివరిస్తారన్నారు. అనంతరం నాతీయ మహఫిల్ జరుగుతుందన్నారు. మంగళవారం సామూహిక భోజనాలు ఉంటాయన్నారు. రాత్రి మహఫిలే చిరాగా కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

మెదక్ అర్బన్, మే 19: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన పరమైన కారణాలు, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని కోరారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

చేగుంట, మే19: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, బండి ప్రతాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని ఏఎస్సై రాంబాబు తెలిపా ఆదివారం చేగుంటలోని మెదక్ రోడ్డులో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేనివారికి జరిమానాలు వేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని, వాహన పత్రాలు ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని ఏఎస్సై తెలిపారు. తనిఖీలో సిబ్బంది నాయుడు, రవి తదితరున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ॥గ॥ ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630 / 9989554915.
NT-5279

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.